# తిరుగుబాటు

పొద్దు బారెడుంది. పొలం నులకు వెళ్ళిన జనం యింకా రాలేదు. ఊరంతా చిన్నబోయి నట్టుంది. వీధుల్లో ఆడుకుం టున్న పిల్లలు అక్కడక్కడ కుక్కి మంచాలపై, గోడవమ్మటే వున్న అరుగులపై ముదుసలి వాళ్ళు గత జీవితాన్ని నెమరు వేసుకుంటూ రాబోయే చావును తలుచుకుంటూ కూర్చున్నారు.

శివలింగం శివ మెత్తిన వాడిలా పరుగే పరుగు. బెదిరి పరిగెత్తుతున్న కోళ్ళపై బరిసెను విసిరాడు. ఓ కోడి నేలకొరిగింది. వెంటనే పరుగెత్తి దాని రెండు కాళ్ళు అందు కున్నాడు. అది రెప్పలను టపటపలాడిస్తూ అరుస్తూ వుంది. తనను అంతగా పరిగెత్తించినందుకు పళ్లు కొరుకుతూ కోడిని తిడుతువున్నాడు.

శివలింగం ఆ వూరి మస్కూరి. అంతకు ముందు తండ్రి అంతకంటె ముందు వాళ్ళ తాత అదే పని చేస్తుండేవాళ్ళట.

శివలింగం ఓ గుడిసె ముందు నిలబడి ''ఎంకయ్య ఓరి ఎంకయ్యా'', అని పిలిచాడు. ఎవరు పలకలేదు.

చేతిలో వున్న కర్రతో తలుపును నెట్టాడు. ఎదురింటి సూరుకింద ఆడుకుంటున్న పదేండ్ల పిల్లవాడు వచ్చి యింటి తలుపును మూస్తూ ''మా అయ్యలేడు. బాయితోడబోయిండు'' అన్నాడు.

''లేకుంటెట్లరా, ఇయ్యాల వంతు మీదే, సర్కారోలొచ్చింన్రు, కట్టెలు కొట్టాలె''

నాకు తెలువదు అన్నట్టు పెదాలను బిగపడుతు భుజాలను ఓసారి ఎగరేసి వదిలాడు.

''నీవన్న రామరి'' అన్నప్పుడు ముఖంలో విసుగు, ధ్వనిలో ఆతురత కనిపించింది.

''నేనొచ్చి ఏంజేస్త'' శివలింగం ముఖం చూడకుండ నేలను చూస్తూ అన్నాడు.

''మనిషికి మనిషే ఆసర దీన్ని పట్టుకొని పోలీసు పటేలు ఇంటికి నడు'' అంటూ కోడిని పిల్లవానికిచ్చాడు. చేతులు మారుతున్నప్పుడు కోడి రెపరెప కొట్టుకుంది. దాన్ని బాగా తేరి పార జూశాడు పిల్లవాడు.

శివలింగం సందు తిర్గ్గానే పరుగు పరుగున కొంచెం దూరంలో కూర్చున్న రుక్కయ్యతాత దగ్గరి కెళ్ళి, ఇది పక్కింటోల్ల కోడని ఆల్లు లేనిది సూసి పట్టుకొస్తుండని చెప్పాడు. రుక్కయ్యతాత అంతా విని నోటిలోని చుట్టను తనభుజం మీద వున్న కర్రకు వత్తి ''నేను పట్టుకుంటప్పుడే సూసిన, ఏం జేస్తం సర్కారోల్లొచ్చినప్పుడు ఎవరిదిదొరికితే ఆల్లది. యిది ఈనాటిది కాదు. ఎనకటినుంచి వస్తున్నదే'' అన్నాడు.

''మరి పైసలు'' రుక్కయ్య ముఖంలోకి సూటిగ చూస్తూ అడిగాడు.

''యియ్యరు'' చుట్టను నోట్లో పెట్టుకుంటు అన్నాడు.

''మరి మనం కోడినెందుకియ్యాలి'' కోడివైపు చూస్తూ అన్నాడు. అప్పుడు కూడి కూడ ''క్కొ - క్కొ'' అని శబ్దం చేసింది.

''నీకు యిప్పుడియన్ని తెలువవులే, తర్వాత తర్వాత తెలుస్తయి.''

''పెద్దయినంకనా'' చేతిలో తలకిందులుగ వేళాడుతున్న కోడి రెపరెప కొట్టుకుంది. దాన్ని ఎడమచేతిలోనుండి కుడిచేతిలోనికి మార్చుకొని పోలీసు పటేలు యింటివైపు నడిచాడు పిల్లవాడు.

ఊరుమధ్యన పెద్దబజారును ఆనుకునే పటేలు ఇల్లు. పక్కమ్మటి వున్న సందునుండి వెళితే పశువుల కొట్టాలు, వాటి ముందు పెద్ద చింత చెట్టు. అక్కడే వంటలు చేస్తున్నట్టున్నారు. అక్కడికి కొంత దూరములో ఓ సాయబు కుర్చీలో కూర్చొన్నాడు. తలపై ఎర్రటి కుచ్చుటోపి వుంది. నిండు చేతుల కమీజు తొడుక్కుని గళ్ళ లుంగీ కట్టుకున్నాడు. ఆయన కమీజుకు మామూలు గుండీలు కాక వెండి గుండీలున్నవి. అంతే కాదు వాటికి సన్నటి వెండి గొలుసులు వేలాడుతున్నాయి. ఆయన ఏదో కాగితాలను చూస్తూ వున్నాడు. కుమ్మరి మల్లయ్య పొయ్యిలోని కట్టెల్ని కదిలిస్తూ అక్కడికొచ్చి నిలుచున్న పిల్లగాన్ని చూసి, ఆ దడి అవతల

గంపకింద కమ్మి.'' అన్నాడు. సరే అన్నట్టు తల ఊపి దడి వెనక్కు నడిచాడు. అక్కడ ఓ గంప బోర్లించి వున్నది. దానికింద యింకా కొన్ని కోళ్లున్న శబ్దము. కాసేపు ఆలోచిస్తూ నిలుచున్నాడు. వీటిని కూడ పైసలియ్యకుంటనే పట్టుకురావచ్చు! ఎంత అన్యాయం అనుకుంటున్న పిల్లగానికి ఓ మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

పొయ్యిలకు, తాను నిలుచున్న చోటికి మధ్యలో తాటాకులదడి, ఏం చేసినా కనబడదు. చుట్టుచూసి ఒక్కసారే గంపను లేపాడు. తాను తెచ్చిన కోడిని వాటిలో కలిపి చేతులు దులుపుకుంటూ వచ్చిన దోవన నడుస్తూ ఏదో గొప్ప పని చేసినట్టుగా శ్వాస పీల్చాడు. ఆ తరవాత రుక్కయ్య తాతను ఎక్కిరించినట్టు పెదాలను ఓసారి కదిలించాడు. బాటలో ఎముకను కొరుకుతున్న కుక్కపైకి రాయి విసిరాడు. అది గుర్‌మంటూ చూసింది. నడకలో వేగాన్ని పెంచాడు.

మరునాడు పొద్దున్నే ఎవరెవరి కోళ్లనైతే పట్టుకొచ్చిండ్రో వాళ్ళనే పిలుచుకొచ్చి పోలీసు పటేలు వాకిట్లో నిలబెడుతున్నాడు శివలింగం. పాశం పుల్లారెడ్డి పటేలు ఇంట్లోనుండి వస్తూనే అంతకుముందే తెచ్చి అరుగుమీద వుంచిన చింత బరిగెను అందుకొని,

''సెప్పండిరా ఎవరెవరు కోళ్ళను మల్ల పట్టుకపోయిండ్రో'' అంటూ ఒక్కొక్కన్ని కొడుతువుంటె-

''నాకు తెలవదు పటేల'' చేతులు జోడిస్తూ ఒకడు

''నిన్న వూల్ల లేనేలేను. మా పుంజును తెచ్చిండ్రటట, తెస్తే తెస్తిరి అనుకున్నగాని నాకేం తెలువదు పటేల నీకాల్‌మొక్కుత'' చేతులు కట్టుకొని అన్నాడు మరొకడు.

''పటేల యియ్యాల కొత్తగన, నాటినుండి కోళ్లను యిస్తలేమా నీ

కాల్ మొక్కుతా'' ఎంకయ్య తలరుమాలును తీసి చేతుల్లో పట్టుకొని అన్నాడు. అతను పటేలుకంటె పెద్ద వయస్సువాడే!

''మరి కోళ్లెటుపాయె'' అంటు గుడ్లురిమాడు పటేలు. పండ్లు పటపట కొరికాడు. తుపాకి తూటల్లా తిట్లు, కొరడా దెబ్బల్లా బరిగెల దెబ్బలు. అమ్మ-అయ్య తప్ప మరో మాటే లేదు!

ఏం తప్పు చేయని అమాయకులు, చేతులడ్డు పెడుతు తలవంచుకుని నిలుచున్నారు. శరీరాలు బరిగెల దెబ్బలకు రక్తాన్ని వొడుస్తున్నాయి.

అది చూసిన కుమ్మరి మల్లయ్య-

''పటేలా అందర్ని ఎందుకు కొట్టేది నీకాల్మొక్కుత. కోళ్ళను ఈ ఎంకని కొడుకు, ఆ కరి కోడిని పట్టుకొస్తే, ఆ గంపకింద కమ్మరా, అని మాపని మీద మేమున్నాం. మరి ఆడు ఏమనుకుండో అని కోడిని వదిలినట్టుంది. గంపను లేపినట్టుంది'' అన్నాడు.

''ఇన్నావురా నీ కొడుకు జేబట్టి రాత్రి దొరలు పప్పుతిని పోయిరి. పో, పట్టుకరాపో, నీ కొడుకును, ఆని తోలు వొలుస్తా'' అని గద్దించాడు.

ఎంకయ్య వొళ్లు జల్లుమన్నది.

''పొద్దున్నే లేసి ఎటుపోయిండో జాడలేడు పటేల''

''అంటే'' పుల్లారెడ్డి

''గదే తెల్వదు ఎటుపోయిండో ఏమో''

''తెల్వదు'' అనుకుంటూ ఎంకయ్య దగ్గరికి వొచ్చి, కసిని, కోపాన్ని కలపోసి చేయిచేసుకున్నాడు. బరిగె ముక్కలైంది. దానికంతా రక్తమే రక్తం.

''లింగా ఈని కొడుకు యాడుండో ఈనికి తెలవదు? జరచూసిరాపో'' అంటు చేతిలోని బరిగె ముక్కను ఎంకయ్య మీదికే విసిరి అక్కడనుండి కాస్త పక్కకు జరిగాడు ''ఎతికిన దొరకలేదు. ఆని

అమ్మని కూడ అడిగిన, యింకా యింటికే రాలేదు'' అన్నాడు శివలింగం.

''ఎటు దో లినవు, యాడ దాసినావు'' కళ్లు పెద్దవి చేస్తూ గద్దించాడు. అప్పుడు అతని కళ్ళు ఎర్రగ నిప్పు కనికల్లాగున్నవి. ''అన్ని వంగబెట్టి అక్కడున్న బండను పెట్టుర్రా'' అని ఆజ్ఞను జారీచేస్తూ యింట్లోకి నడిచాడు పాపపు పుల్లారెడ్డి.

సుడిగాలి వచ్చి పోయినట్టుగ వుంది ఆ వాకిలి.

పటేలు లోపలికి పోగానే అప్పటివరకు గోడల చాటున ఏడస్తున్న ఆడవాళ్ళు వాకిట్లో కొచ్చి తమ తమ మొగవాళ్ల గాయాలను కొంగులతో అద్దుతు, తన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుతువున్నారు.

చెట్లను నరికే శక్తి వాళ్ళది!

బావులను తవ్వే బలము వాళ్ళది!

••••

బజారులో డప్పుచప్పుడుకు సందుల్లో ఆడుకుంటున్న పిల్లల దీపం చుట్టు ఉసిల్లలా డప్పువాని చుట్టూ చేరారు.

ఎట్టివాడు డప్పుకొట్టడం ఆపి, కుడిచేతిని, మూతి దగ్గరవుంచి ''ఇందుమూలంగా రైతులందరికి తెలియ జేయడం ఏందంటే, సర్కార వారికి యివ్వవలసిన లేవిగల్లను రేపటినుండి కొలవవలసిందిగా సర్కార్ ఆజ్ఞల్లో'' అని నలుగురికి వినపడేటట్టు చెప్పి మళ్ళి డప్పు వాయిస్తూ మరో సందువైపు మల్లగా, పిల్లలు వెంబడించారు.

మరునాడు రచ్చబండ దగ్గర లేవిధాన్యాన్ని కొలుస్తువున్నారు. పంట పండని రైతులు కూడ అచ్చుకట్టిన పొలం ఆధారంగా లేవి కట్టవలసిందే అంటున్నాడు పుల్లారెడ్డి దానికి నైజాం పోలీసుల వంతపాట.

చినకాపర్తి దాని చుట్టుపక్కల గ్రామాల్లో పాశం పుల్లారెడ్డి తన లేవిని

ఇతర రైతుల మీద వేసి బాదిస్తూవున్నాడు. విత్తనాలకు కూడ మిగలకుండా లేవి పోసినా రైతులకు సర్కారోల్ల తన్నులు, గుద్దులు, యిటు పెత్తందార్ల దోపిడి తప్పడం లేదు! నలుగురు రైతులు లేవి కొలవలేదని పుల్లారెడ్డి చావట్లో వంగబెట్టి బండలు ఎత్తించాడు. మిట్ట మధ్యాహ్నం ఎర్రటి ఎండ. అప్పటికి రెండురోజుల నుండి గంజి గటక దొరకని ఓ పేదరైతు కళ్ళు తిరిగి బండను అట్లనే మీద వేసుకుని పడిపోయాడు. అది చూసిన వాళ్ళు ''అయ్యో'' అంటూ కన్నీరు పెట్టిన పుల్లారెడ్డికి దయ రాలేదు. ఆ రైతు పాడిబర్రెను పట్టుకొచ్చి కట్టేస్తే గాని ఆయన వీపుమీద బండను దించలేదు. చెప్పుకునే దిక్కులేక తన భూమిని, పూరిగుడిసెను వదలి కట్టుబట్టలతో ఊరు విడిచి పోయాడు ఓ పేదరైతు. ఆభూమి పుల్లారెడ్డి పహాణిలోకి ఎక్కింది.

రజాకార్లను వెంటేసుకుని ఊర్లు తిరుగుతు ఎదిరించినవాళ్ళ చీకటోళ్ళని కాల్చి చంపించాడు. ఆ చుట్టు ప్రక్కల పుల్లారెడ్డి మాటకు తిరుగులేదు. చేతకు ఎదురులేదు. వాడొక పల్లేరుకాయ!

ఓరోజు పుల్లారెడ్డి తన గూండాలతో కొంపెల్లి గ్రామానికి వెళ్ళి రైతులందర్ని పిలిపించి అప్కారి రఖం, లేవిగల్ల, భూమి శిస్తును చెల్లించమని వత్తిడిచేశాడు. యివ్వలేని రైతులను చింత బరిగెలతో కొట్టించి హింసించాడు. దెబ్బలకు తట్టుకోలేని జనం రాళ్ళు రువ్వారు. పోలీసులు, రజాకారులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో వీరమల్ల వెంకన్న నేలకొరిగాడు. ఈ లోపల గెరిల్లా దళం ఎదురుకాల్పులు జరుపగా గూండాలు పారిపోయారు. ''ఎప్పటికైనా పుల్లారెడ్డిని చంపి వెంకన్న సమాధి దగ్గిర కాళ్ళవైపు పాతుతాం'' అని శపథం చేశారు.

ఈ దోపిడి దొరల దౌర్జన్యాన్ని తట్టుకోలేని రైతులు, చాకిరి కులాలు

కలిసి కోడి కూసె వరకు నారాయణపురం ఊరుదాటి రాచకొండ వైపు నడుస్తువున్నారు. తమ బాధలను గుట్టల్లో వున్నసంఘపోల్లకు చెప్పుకోవాలని వాళ్ల ప్రయాణం. బాగా చలిగా వుంది. తొవ్వపక్కన వున్న మర్రిచెట్టు కింద ఆగి, చెత్త చెదారం ఒక్కచోట వేసి నిప్పంటించి చుట్టు కూర్చున్నారు.

''ఆ సర్కారోడు యాడ సచ్చిండో కాని, మన ఊరిల పుట్టి మనతోటి పెరిగిన దొరలు, జమీనుదారులు మనల దోస్తుండ్రు గద'' అన్నాడు పేదరైతు రాజయ్య తనకు జరిగిన నష్టాన్ని తలచుకుంటూ.

''వట్టి దోసుడే కాదు పెట్టే బాధలు'' అన్నాడు మల్లయ్య. ఆయువకు నలపై ఏండ్లు. సరిగా తిండిలేక అరవైలా కనిపిస్తున్నాడు.

''యిగ బాధలను తలచుకుంటే బతకడమే కష్టం'' లింగయ్య.

''ఆనలులేక, పండే ఈ పాటి పంటలకు రకం కట్టడమే కష్టంగా వుంటే యింకా లేవోటి పెట్టి సంపుతుండ్రు కద'' మల్లయ్య.

''ఏ ఒక్కసారే సంపినా బాగుండు'' ఈ రోజుకింత సంపుడేంది. అచ్చుకడితే చాల్లుండవా? లేవి కొలవకపోతే దండుగలనిరి. గొర్రె- బర్రెను తోలిక పోబట్టిరి'' రాజయ్య.

''అందుకే కదా రకం కట్టలేక పుల్లయ్య ఊరెల్లిపాయె, లేవిగట్టలేక లింగయ్య భూమి నొదులుకునే. ఎక్కడి కష్టాలురా తండ్రీ'' మల్లయ్య.

''పొలం పారక పందుమో, పుట్టెడు పాలసన్నలో, గొట్టొడ్లో పండితే సావుకారి అప్పు కిందనే ఎత్తుకపాయె. మిగిలింది ఏముంది కడుపుల ఆకలి, కళ్ళల్ల నీళ్లు'' అన్నాడు రాజయ్య.

''మంట పెద్దగ అవుతుంది, ఆర్పుల్ల'' అంటూ తలాకాస్త మట్టిని చల్లి మంటను ఆర్పి, గుట్టవైపు నడిచారు.

అప్పుడే తూర్పున సూర్యుడు ఎర్రగా ఎక్కొస్తున్నాడు.

••••

నైజాం సంస్థానమంతా యూనియన్ మిలట్రీ దిగింది.

అటు చీకటోల్లను ఇటు రజాకార్లను ఏరి ఏరి పట్టుకుంటున్నారు. ఊరు ఊరును చుట్టు ముట్టి దళనాయకులను కాల్చేస్తువున్నారు. నిజాము తొత్తులుగ వున్న దొరలు, భూసాములు కొత్త కాంగ్రేసులుగ మారి సైనికులతో సంబంధాలను పెంచుకుంటున్నారు.

పాశం పుల్లారెడ్డిగూర్చి విన్న సైనికులు కాపర్తిని చుట్టుముట్టి ఆయన్ను పట్టుకొని బందీగ దీసుకెళ్ళటం చూసిన జనం, పుల్లారెడ్డిని సైనికుల నుండి విడిపించుకోవాలని ఊరంతా ఒక్కటై సైనికుల ఎదుటికి వెళ్ళి దండాలు పెట్టారు. దారికి అడ్డం నిలచారు.

''పటేలు మంచివాడు మా శ్రేయోభిలాషి'' అన్నారు.

''ఆయనకు ఏ హాని తలపెట్టవద్దు'' అని ప్రాధేయపడ్డారు.

ఆ తెలుగు మాటలు మిలటరి వాళ్ళకు అర్థం కాలేదు. కాని వాళ్ళ సైగలను అర్థం చేసుకుని, వాళ్ళ కోరికను మన్నించి పుల్లారెడ్డిని వొదిలి చేతులను వూపుతూ వెళ్ళారు.

ప్రజల్లో వచ్చిన మార్పుకు పుల్లారెడ్డికి ఆశ్చర్యం వేసింది. తాను వాళ్ళకే మిస్తే తనకేమిస్తున్నారు. ఈ రోజు వీళ్ళు తనను యిడుపించకపోతే సైనికులు కొంతవరకు తీసుకెళ్ళి కాల్చేసేవారె కదా! సిగ్గుతో కాసేపు తలవంచుకొని ఆ తరువాత అందరివైపు కృతజ్ఞతా పూర్వకముగ చూశాడు.

''అందరు మంచోనివైనా చెడ్డోనివైనా నీవు మా మధ్యే'' అన్నారు. పుల్లారెడ్డిది పాశాణం లాంటి మనసు, పాదరసమైంది ఆ క్షణంలో ఎప్పుడు ఏదో ద్వేషం, కసి కదిలాడే అతని పెదాలపై ఓ చిరునవ్వు

కదిలిందికాని అందులో ఎందుకో జీవం లేదు. ఎండిన పెదాలను నాలుకతో తడిచేసుకున్నాడు.

''తమరు ముందు నడవండి, మీ వెనుకమేము'' అన్నారు.

పుల్లారెడ్డి ముందు నడుస్తూ వుంటె ఊరి పొలిమేర నుండి చావట్లోకి ఊరేగింపుగా చేరారు.

''అందరు వందేమాతరం'' అంటు నినాదాలు చేశారు.

ఈజనం ఎంత మంచివాళ్ళు అనుకుంటు తబ్బిబ్బవు తున్నాడు పుల్లారెడ్డి. ఇంతకు ముందు ఆ మాట వింటె పుల్లారెడ్డికి కోపం వచ్చేది. ఈ రోజు తను కూడా అదే మాట అంటు వున్నాడు.

ఆడవాళ్ళు చప్పట్లు కొడుతు పాటలు పాడుతున్నారు.

పిల్లలు కేరింతలు కొడుతు తిరుగుతున్నారు. గ్రామ రక్షక దళ సభ్యులు తమ తమ ఆయుధాలను అందుకొచ్చుకొని ఓ వింత నృత్యం చేస్తువున్నారు. అది కొండ జాతి వాళ్ళు తమ కుల దేవతకు బలి యిచ్చేటప్పుడు చేసే నృత్యం లాంటిది. ఆటకాళ్లు, పాటకాళ్లు, ఆయుధాలవాళ్లు, ఆడుతూ పాడుతూ పుల్లారెడ్డి చుట్టూ వలయంగ మారుతున్నారు. పుల్లారెడ్డి కెందుకో తన పాత జ్ఞాపకాలు గుర్తొస్తు భయాన్ని కలిగిస్తున్నాయి. వంట్లో వనుకు కంట్లో మసక కమ్ముతువుంది. చెమటతో చొక్క అక్కడ అక్కడ తడిసిపోతువుంది. చప్పట్లు వేస్తున్న ఆడవాళ్ళను చూస్తువుంటే తాను గుంజిన గృహిణులు గొర్తొస్తువున్నారు. వాళ్ళ దీనాతిదీనమైన చూపులూ గుర్తొస్తువున్నాయి. ఊళ్ళోని జనాన్ని చూస్తుంటె తాను సాగించిన జులుం గుర్తొస్తువుంది.

బరిసెలను పట్టుకున్న వాళ్ళను చూస్తే తాను చేయించుకున్న వెట్టి చాకిరి గుర్తొస్తువుంది. తిట్టిఎట్టిపని చేయించుకుంటె కద

అనుకుంటున్నాడు.

ఉరుమడ్ల వడ్ల రాములు చావు గుర్తుకు వొచ్చింది. జనం ఎగురుడు చూస్తుంటే కొంపెల్లి వీరమళ్ళ వెంకన్నను చంపిన తీరు గుర్తుకు రాగానే పుల్లారెడ్డి వీపున ఎవరో కొరడాతో కొట్టినట్లు అనిపించింది.

డప్పు చప్పుల్లో దరువు మారింది!

వాళ్ళు పాడే పాటలు మారుతున్నాయి!

వాళ్ళు ఆడటం లేదు. ఎగురుతున్నారు. దూకుతున్నారు. ఒక్కసారె జనం చేతుల్లో కత్తులు మెరిసాయి.

వలయం దగ్గర అవుతువుంది.

జనం కళ్ళల్లో నెత్తురు కమ్ముతూవుంది.

వల్లంతా చెమటలు! చూపుల్లో భయం! పుల్లారెడ్డి చుట్టుచూసి రెప్పపాటున వలయాన్ని తప్పించుకొని ఒకరి చేతిలోని కత్తిని లాక్కొని పరుగు తీసాడు.

అతని వెంట జనం! వాళ్ళ చేతుల్లో ఆయుధాలు!

సందుల గొందులు తిరిగి పరుగెత్తి పరుగెత్తి ఓ ఇంట్లోకి దూరాడు. అది చూసిన సాలేరాములు ''ఇదిగో ఈ యింట్లోనే దాక్కుండు'' అని చేత్తో చూపించాడు. అది గమనించిన పుల్లారెడ్డి వెనక్కు మళ్లి తనను చూపించిన రాములు చేయిని భుజం వరకు నర్కేసి అక్కడి నుండి తప్పించుకుని పరుగెత్తి మరో గుడిసెలో దూరాడు. అదేగుడిసె! ఆ గుడిసె ముందు నుండే కోడిని పట్టుక పోయింది. యిప్పుడా గుడిసె ముందు ఓ బాలుడు! సంకలో మేకపిల్ల ఎదురుగ మేక. ఆ గుడిసె ముందె తండ్రి లేడని చెపితే ''నీవన్నరారా'' అని శివలింగం పిలుచుకు పోయిన చిన్నోడే ఈ రోజు అప్పుడే ఈనిన మేక పిల్లకు పాలు కుడుపుతున్నాడు.

పుల్లారెడ్డి గుడిసెలో దూరి తలుపేసుకోగానే ఆనాడు తనను పట్టియ్యమని తన తండ్రిని కొట్టిన దెబ్బలు గుర్తొచ్చాయి ఆ పిల్లవానికి. వెంటనే వెళ్ళి బయటగొళ్ళెం పెట్టి, పరిగెత్తుకొస్తున్న జనానికి ఎదురెళ్ళి ఆ గుడిసె వైపు వేలు చూపించాడు.

ఆ రోజు గంపకింద కమ్మిన కోళ్ళను వొదిలిన చిన్నోడు ఈ రోజు మనిషిని గుడిసెలో కమ్మాడు!

జనం గుడిసెకు నిప్పు పెట్టారు. మంటలే మంటలు

మంటలను చూసిన మిలటరి వాళ్ళు మళ్లీ ఊళ్లోకి వచ్చి ఏమిటి మంటలని హిందీలో అడిగారు.

''ఇంటికి నిప్పంటుకుంది'' అని వినయంగా సైగలతో చెప్పారు. అట్లనా అన్నట్లు తలాడిస్తూ చూశారు.

''గర్ జల్ రా హాయె'' ఎవరో ఉర్దూలో అన్నారు.

''ఓహో'' అనుకుంటూ మళ్ళిపోయారు మిలట్రీ వాళ్లు

జనం కాలుతున్న గుడిసె తలుపు తెరిచారు. అప్పటికె పుల్లారెడ్డి

బట్టలకు నిప్పంటుకుంది పాపం పుల్లారెడ్డి పరుగే పరుగు. జనం తమ చేతుల్లోని ఆయుధాలని పుల్లారెడ్డిపై విసిరారు. అంతే రక్తం ముద్దయి నేలకూలాడు. శవంనుండి తలను వేరుచేసి కొంపెల్లికి పట్టుకెళ్లి ఆ వూళ్లోని బజార్లు తిప్పి వీరమల్ల వెంకన్న సమాధి కాళ్ళవైపు పాతిపెట్టి ఊపిరి పీల్చారు.

ఈ తిరుగుబాటులో చుట్టుపట్టు గ్రామాల బాధితులందరు చేయి చేయి కలిపారు. అడుగులో అడుగేస్తూ నడిచారు.

''బొల్లి గుట్ట మీద బోనాలు'' ''పాశం పుల్లారెడ్డి దినాలు''

అని పాట గుంపులో ఎవరో పాడగ అందరు ఆ పాటకు అనుకూలంగా చప్పట్ల దరువు కలిపారు. •1997